క్లుప్తంగా

వైభవంగా శ్రీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీసుదర్శన లక్ష్మీనరసింహ హోమం చేసిన తర్వాత ప్రత్యేక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. రాత్రి ఏడు గంటలకు సామూహిక రమా సహిత సత్యదేవ వ్రతం చేశారు. కాగా శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం జయప్రదం చేయండి



పెనమలూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి అందరి సహకారం కావాలని యోగా శక్తి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. జూన్ ఒకటి నుంచి 21వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ యోగాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటరమణ, తాడిగడప మున్సిపాలిటీలో కమిషనర్ భవానీప్రసాద్‌లచే పోస్టర్ ఆవిష్కరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ పంపిణీ



రామవరప్పాడు: వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ ప్రోత్సాహంతో పితృదేవోభవ క్లబ్ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు శనివారం ఎనికేపాడు పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం పక్కన మండల పరిషత్ పాఠశాల వద్ద సబ్జా సుగంధి వాటర్‌ను బాటసారులు, ప్రయాణికులకు పంపిణీ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు మజ్జిగ అందించారు. సెక్రటరీ వుడత్తు నరేంద్ర, తమ్మన సుబ్బారావు, పైడిమర్రి కిషోర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కడియల రవి తెలిపారు. ఈ మేరకు శనివారం కాలేజీలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఆగస్టు 4, 5వ తేదీల్లో తమ కాలేజీలో ఇంటర్నేషనల్ ఆన్ ఇన్నోవేటివ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ వీఆర్ ఈడూ కేర్ సహకారంతో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పలు ఆవిష్కరణలు, పరిశోధనలు, సాంకేతిక పత్రాలు సమర్పణ ఉంటాయని తెలిపారు. డీన్ ఆర్ సత్యప్రసాద్, డాక్టర్ రాజేష్, పీ వెంకటరమేష్, సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రకు ప్రజలు దూరం



విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ప్రజలు దూరంగా ఉంటున్నారు. ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను భాగస్వాములను చేసి స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో శనివారం ప్రజలు ఎండ తీవ్రత, వేసవి వడగాల్పులు నుంచి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొనే విధంగా అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే మొక్కలు నాటే కార్యక్రమం గ్రామాల్లో మొక్కుబడిగా జరిగింది. ప్రజలకు, సోషల్ వర్కర్లకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కార్యక్రమం నిర్వహించారు. నున్న గ్రామంలో మూడవ సచివాలయం వద్ద సచివాలయ సిబ్బంది కేవలం రెండు మొక్కలు నాటి చేతులు దులుపుకొన్నారు. పాతపాడు గ్రామంలో పంచాయతీ శానిటరీ సిబ్బంది మొక్కలు నాటారు. పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో ఒక్కోమొక్కను నాటారు.

పంచాయతీలకు భారంగా చెత్త తరలింపు

- మూడు మేజరు గ్రామాల్లో సమస్య
- వాహనం నిర్వహణ ఇబ్బందిగా మారిన వైనం
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



చెత్త తరలింపు వాహనం

గన్నవరం: గన్నవరం, కేసరపల్లి, బుద్ధవరం గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను జిందాల్ కంపెనీకి తరలించేందుకు కొనుగోలు చేసిన వాహనం నిర్వహణ పెను భారంగా మారింది. ఇంధనం, టోల్‌గేట్ ఫీజులు, డ్రైవర్ జీతాలు, వాహన నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పటికే పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం ప్రతినెలా లక్షల రూపాయలు వెచ్చిస్తున్న ఆయా గ్రామ పంచాయతీలు అదనంగా చెత్త తరలింపు వాహనం కోసం నెలకు మరో రూ. 4 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ చెత్త సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన గన్నవరం, కేసరపల్లి, బుద్ధవరంలో డంపింగ్ యార్డులు లేకపోవడంతో సేకరించిన చెత్తను శివారు ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. దీంతో చెత్త నిల్వల భారీగా పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం చెత్తను గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలించేందుకు రూ. 54 లక్షలతో వాహనాన్ని కొనుగోలు చేశారు. వాహన కొనుగోలు, నిర్వహణ ఖర్చులను 50 : 30 : 20 నిష్పత్తిలో గన్నవరం, కేసరపల్లి, బుద్ధవరం గ్రామ పంచాయతీలు భరించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. గతేడాది అక్టోబర్ 21 నుంచి చెత్త తరలింపు వాహనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు.

భారమవుతున్న వాహన నిర్వహణ

ఈ మూడు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం కార్మికుల వేతనాలు, పనిముట్లు బ్లీచింగ్, సున్నం కొనుగోలు, ట్రాక్టర్ల ఇంధనం ఖర్చుల నిమిత్తం నెలకు రూ. 25 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. వీటికి అదనంగా చెత్త తరలింపు వాహన ఖర్చులకు మరో రూ. 4 లక్షల వరకు భరించాల్సి వస్తోంది. ఈ మూడు గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను రోజుకు రెండు సార్లు జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు. దీని కోసం ప్రతిరోజు ఇందనానికి రూ. 8 వేలు, టోల్‌గేట్ ఛార్జీలు రూ. 1,690 చెల్లించాల్సి వస్తోంది. ఇద్దరు డ్రైవర్లకు రూ. 42 వేలు వరకు జీతాలు, వాహనం మెయింటినెన్స్ ఖర్చులు గ్రామ పంచాయతీలు భరిస్తున్నాయి. తొలుత జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కాజా టోల్‌గేట్ వద్ద ఫీజు మినహాయింపు కల్పించారు. గత రెండు నెలలు నుంచి టోల్‌గేట్ ఛార్జీలు తప్పనిసారి చేయడంతో అదనపు భారంగా మారింది.

ఎక్కడి చెత్త అక్కడే..

ప్రతి నెలా చెత్త తరలింపునకు రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. జిందాల్ కంపెనీలో విద్యుత్ తయారీ కోసం పొడి చెత్తను మాత్రమే సేకరిస్తున్నారు. దీంతో గ్రామంలో సేకరించిన తడి చెత్త నిర్వహణ సమస్యగా మారింది. బుద్ధవరం, అల్లాపురంలో తడిచెత్తను కొంతమేర కంపోస్ట్ ఎరువుల తయారీకి, మిగిలిన వ్యర్థాలను గ్రామ శివారులో డంప్ చేసి తగులబెడుతున్నారు. గన్నవరంలో మాత్రం భారీగా వస్తున్న కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, ఇతర తడి చెత్తను బయటకు తరలించడం కష్టసాధ్యంగా మారిందని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కొంత మంది వ్యాపారులు అయితే కొబ్బరి, మాంసం వ్యర్థాలను మూటలు కట్టి స్థానిక కొత్తపేట వద్ద జాతీయ రహదారి పక్కన డంప్ చేస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీలో ఎక్కడి చెత్త అక్కడే అన్నట్లుగా దర్శనమిస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరుతున్నారు.

టోల్ ఫీజు మినహాయించాలి

చెత్త తరలింపు కోసం ప్రతినెలా గన్నవరం గ్రామ పంచాయతీకి రూ. 2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే ప్రజా అవసరాల నిమిత్తం వినియోగిస్తున్న ఈ వాహనానికి టోల్ ఫీజు మినహాయింపు కల్పించాలి. జిందాల్‌కు పొడి చెత్తను తరలిస్తుండగా, తడి చెత్త నిర్వహణ ఇబ్బందిగా మారింది.

–చెన్నకేశవరావు, పంచాయతీ కార్యదర్శి, గన్నవరం.

చెత్త నిర్వహణ అస్తవ్యస్తం

గన్నవరం గ్రామ పంచాయతీ చెత్త నిర్వహణకు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త నిల్వలు పేరుకుని అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తుంది. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన పారిశుద్ధ్యం మెరుగుపర్చే దిశగా చర్యలు తీసుకోవాలి.

–ఆళ్ల కృష్ణకిషోర్, న్యాయవాది, గన్నవరం

అత్యవసర వైద్య సేవలపై అవగాహన



గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో శనివారం ఎన్‌సీసీ వింగ్ ఆధ్వర్యాన విపత్తుల సమయంలో అత్యవసర వైద్య సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి అత్యవసర వైద్య సేవల విభాగాధిపతి డాక్టర్ టీ కృష్ణచైతన్య నేతృత్వంలోని వైద్య బృందం ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుండెపోటు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, తీవ్ర రక్తస్రావం, అపస్మారక స్థితిలో అందించాల్సిన వైద్య సేవలను వివరించారు. కల్నల్ టీ ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయబాల్, డాక్టర్ బీ అక్షర, డాక్టర్ జీ ఆనంద్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు: ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పీ అనూష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్లాబ్–1 కింద రూ. 1 లక్ష లోపు రుణం కోసం 14 యూనిట్లు మంజూరయ్యాయని చెప్పారు. శ్లాబ్–2 కింద రూ. 1లక్ష నుంచి రూ. 3 లక్షలు లోపు రుణం కోసం మూడు యూనిట్లు, శ్లాబ్–3 కింద రూ. 3 లక్షలు నుంచి రూ. 5 లక్షలు రుణం కోసం ఒక యూనిట్ మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీవేణుగోపాలస్వామికి అష్టబంధ ప్రయోగం



అష్టబంధ విశిష్టతను ఉపదేశిస్తున్న శ్రీనివాస దీక్షితులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న అష్టబంధ మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాల్లో భాగంగా శనివారం శ్రీవేణుగోపాలస్వామివారికి అష్టబంధ ప్రయోగం జరిగింది. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాలను పునరుద్ధరించగా పుణ్యాహవచనం, కుంభారాధన, అష్టబంధ ద్రవ్య ఆరాధన క్రతువుల అనంతరం టీటీడీ ధర్మగిరి వేద పాఠశాల ఆచార్యులు, వైఖానస ఆగమ రత్న స్ఫురత్ రత్న శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, వేద పండితులు సుదర్శనం సీతారామాచార్యులు సమక్షంలో వేణుగోపాలస్వామికి అష్టబంధ ప్రయోగం జరిగింది. తొలుత దేవస్థానం ప్రధానార్చకులు రొంపిచర్ల అప్పలాచార్యులు(గోపాలం), రొంపిచర్ల శేషాచార్యులు, అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో రుత్విక్కుల బృందం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస దీక్షితులు అష్టబంధనం, అందుకు సంబంధించిన నియమ నిబంధనలను భక్తులకు ఉపదేశించారు. అలాగే సుదర్శనం సీతారామాచార్యులు భాగవతం, దాని విశిష్టతను ఉపదేశించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తాడిగడపలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ భవానీప్రసాద్



కడవకొల్లులో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ హేలా షారోన్, ఇతర అధికారులు

పెనమలూరు: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకిలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం తాడిగడప జంక్షన్‌లో బీట్ ది హీట్ థీమ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

ఉయ్యూరు: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని ఉయ్యూరు ఆర్డీఓ హేలా షారోన్ అన్నారు. మండలంలోని కడవకొల్లు గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీట్ ద హీట్ పురస్కరించుకుని చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి గ్రామాల్లో ప్రజలకు చలివేంద్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శేషగిరిరావు, సర్పంచ్ మంగినేని సుధారాణి, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఉయ్యూరు ప్రధాన సెంటరులో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, సిబ్బంది పరిసరాల పరిశుభ్రత పాటించి చలివేంద్రం ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి



విలేకరుల సమావేశంలో విద్యాసాగర్, సంఘ నేతలు

గన్నవరం: విద్యాశాఖ తీసుకుంటున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన ఉమ్మడి జిల్లా డీఈఓ కార్యాలయం ముట్టడి చేపట్టినట్లు ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ సంఘాల లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా జీఓలను విడుదల చేయడం దుర్మార్గమన్నారు. తొమ్మిది రకాల పాఠశాలలను ప్రతిపాదించడం కూడా విద్యా వ్యవస్థ పురోభివృద్ధికి మంచిది కాదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, బదిలీల్లో పోస్టులు బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలు చూపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇరువురు టీచర్లను ఉండేలా చూడాలన్నారు. మరో ఎనిమిది ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు మోత్రు ఆనంద్‌కుమార్, చిమట కృష్ణారావు, రామెళ్ల ఆనంద్‌కుమార్, శ్రీధర్, సురేష్, అబ్దుల్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



వణుకూరు గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో కుర్చీలాట ఆడుతున్న చిన్నారులు



గన్నవరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సీతారామారావు



పురుషోత్తపట్నంలో మొక్కలు నాటుతున్న లైబ్రేరియన్ కృపానందం



తెన్నేరులో మొక్కలు నాటుతున్న చిన్నారులు

పెనమలూరు: వణుకూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు చదివించడం, తోక కథలు చెప్పించడం చేస్తున్నామని గ్రంథాలయ అధికారిణి భారతి తెలిపారు.

ఉయ్యూరు: స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, ఖోఖో పోటీల్లో చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

విద్యార్థులకు పుస్తక పఠనం

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం శిక్షణతోపాటు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. తొలుత గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు, సభ్యుడు చిమట రామారావు సౌజన్యంతో విద్యార్థులు, పాఠకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

గన్నవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కే కృపానందం పేర్కొన్నారు. శనివారం సమ్మర్ క్యాంపులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ నిర్వహించారు. విద్యార్థులు, పాఠకులచే మొక్కలు నాటించారు. గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచి పరిసరాల పరిశుభ్రతను నేర్పించాలని సూచించారు. గ్రామ పెద్దలు, పాఠకులు, సచివాలయ సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ జ్యోతికుమారి ఆధ్వర్యంలో జరిగిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులచే పుస్తక పఠనం, కథలు చెప్పించడం, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిన్నారులు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రను శనివారం నిర్వహించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చిన్నారులు మొక్కలు నాటారు. భగవద్గీత శ్లోకాల పఠనం, క్యారమ్స్‌లో శిక్షణ పొందారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్ సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. కథల పుస్తకాలను పఠించారు. ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను అభినందించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఎం.మల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

అస్తవ్యస్త డ్రెయినేజీ నిర్మాణంతో అవస్థలు



రాయ్‌నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించిన సీసీ డ్రెయిన్

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో అస్తవ్యస్త డ్రెయినేజీ నిర్మాణంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి నీళ్లు రోడ్డుపై నిలిచి చిన్నసైజు చెరువును తలపిస్తోంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ నిధులతో ఈ సీసీ డ్రెయిన్ నిర్మించారు. అయితే రోడ్డుకు సుమారు అడుగున్నర ఎత్తుగా నాసిరకంగా డ్రెయిన్ నిర్మాణం చేశారు. దీంతో వర్షం నీరు కొత్తగా నిర్మించిన డ్రెయిన్‌లోకి వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి తోడు పందుల సంచారం ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైన గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మురుగునీటి క్రమబద్ధీకరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని హెల్పింగ్ టు గెదర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్, దాతల సహకారంతో నిరుపేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి మాట్లాడుతూ.. నిరుపేద, హెచ్‌ఐవీ బాధిత చిన్నారు కు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. పౌష్టికాహారం లేకపోవడం వల్ల నిరుపేద చిన్నారులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే షఫీవుల్లా, హేమంతరావు, రమ్య, బి.వ సంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే బోడెప్రసాద్, పౌరులు

పెనమలూరు: కానూరు నుంచి పోరంకి వరకు బందరు రోడ్డుపై శనివారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడెప్రసాద్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను చావుదెబ్బ కొట్టిందని అన్నారు. యుద్ధంలో ప్రాణాలు వదిలిన వీర సైనికులకు ఘన నివాళులర్పిస్తున్నామని తెలిపారు. భారత సైనికులు దేశం కోసం చేసిన చేసిన పోరాటం మరువలేనిదని, ప్రతి భారత పౌరుడు సైకులకు సెల్యూట్ చేయాలని కోరారు. ర్యాలీలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, కోయా ఆనంద్‌ప్రసాద్, షేక్ బుజ్జి, బోడె హేమాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడులో...



రామవరప్పాడులో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే యార్లగడ్డ తదితరులు

రామవరప్పాడు: ఆపరేషన్ సిందూర్ విజయవంతమవడంతో సైనికులకు సంఘీభావంగా రామవరప్పాడులో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఉగ్రవాదానికి గట్టి బుద్ధి చెప్పడంతోపాటు ప్రపంచానికి మన దేశ ధైర్యాన్ని చూపిందని పేర్కొన్నారు. ర్యాలీలో పలువురు నాయకులు, స్థానిక పౌరులు పాల్గొన్నారు.